

జనగామలోని రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

## రేషన్‌షాపుల్లో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు

జనగామ, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని పౌరసరఫరాల గోదాం, రేషన్ షాపుల్లోని సన్న బియ్యం బస్తాల తూకాన్ని టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఓఎస్‌డీ బృందంతోపాటు డీఎంసీఎస్ హతీరాం, లీగల్‌మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీటీ సివిల్ సప్లై శ్రీనివాస్‌తో కలిసి స్థానిక వ్యవసాయ మార్కెట్‌లోని గోదాములో సన్న బియ్యం నిల్వలను తూకం వేసి పరిశీలించారు. పట్టణంలోని వీవర్స్‌కాలనీ రేషన్ షాపు నంబర్ 11, బీరప్పగడ్డ షాపు నంబర్ 13లో బియ్యం బస్తాల తూకం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేసినట్లు సివిల్ సప్లై అధికారులు తెలిపారు.

## ఉపాధి పనుల్లో జిల్లాకు నాలుగో స్థానం :డీఆర్డీవో

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 4 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో భాగంగా 2024-25 సంవత్సరానికిగాను కూలీల సంఖ్యాపరంగా జనగామ జిల్లా రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానం సాధించింది. దీనికి సంబంధించిన వివరాలను డీఆర్డీవో ఎన్ వసంత శుక్రవారం విలేకరులకు తెలిపారు. జిల్లాలో 22,378 మంది కూలీలతో రోజువారీ ఉపాధి కూలీ పనులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకంలో జిల్లాకు 30 లక్షల 57 వేల పని దినాలు కేటాయించగా, 30 లక్షల 97 వేల 108 పని దినాల్లో కూలీలకు పని కల్పించినట్లు తెలిపారు. రూ.45 కోట్ల 20 లక్షల మెటీరియల్ పనులకుగాను రూ.46 కోట్ల 12 లక్షల పనులు పూర్తి చేసి వాటికి చెల్లింపులు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో రూ.92 లక్షలు అదనంగా వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాకు రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థాన రావడంపై కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా అభినందించారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## మృతుడి కుటుంబానికి బీఆర్‌ఎస్ శ్రేణుల పరామర్శ

దేవరుప్పుల, ఏప్రిల్ 4: మండలంలోని సీత్యాతండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గుగులోత్ విక్రం శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేశ్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి నేతృత్వంలో నాయకులు మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆలకంట్ల యాదగిరి, గండిపల్లి యాకయ్య, నీలారపు పెద వెంకన్న, సత్యాతండా గ్రామ అధ్యక్షుడు భూక్యా రవి, నాయకులు భూక్యా నిమ్మానాయక్, జాజ్యానాయక్, యాకూనాయక్, భాస్కర్, ఆనంద్, చిత్తలూరు నాగరాజు, సురేశ్ పాల్గొన్నారు.

## జామా మసీదు కమిటీ అధ్యక్షుడిగా హనీఫ్



కొడకండ్ల, ఏప్రిల్ 4 : మండల కేంద్రంలోని జామా మసీదు నూతన కమిటీ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహ్మద్ హనీఫ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మహ్మద్ షన్నా, అబ్దుల్ సలీం, కార్యదర్శిగా మహ్మద్ అసీఫ్, కోశాధికారిగా అబ్దుల్ హమీద్, కార్యవర్గ సభ్యులుగా కదీర్, నసీమ్, సలావుద్దీన్, నవాస్, మహబూబ్, అఫ్రోజ్, అజస్ ఎన్నికయ్యారు.

# రాములోరి కల్యాణ టికెట్లలో దందా..

- వల్మిడీ ఆలయ ఇన్‌చార్జి ఈవో సంతకం ఫోర్జరీ
- ఈవో, కాంగ్రెస్ నాయకులు కుమ్మక్కుపై ఆరోపణలు
- బాధ్యులపై చర్యలకు భక్తుల వేడుకోలు



వల్మిడిలోని రామాలయం(ఇన్‌సెట్‌లో) స్వామి వారి కల్యాణ టికెట్‌పై ఇన్‌చార్జి ఆలయ ఈవో సంతకం ఫోర్జరీ

పాలకుర్తి, ఏప్రిల్ 4: రాములోరి కల్యాణం కమనీయం... కానీ ఇక్కడ మాత్రం స్వామివారి కల్యాణం కాంగ్రెస్ నాయకులకు రమణీయంగా మారింది. దక్షిణ అయోధ్యగా పేరొందిన మండలంలోని వల్మిడిలో మాత్రం సీతారాముల కల్యాణంలో అధికార పార్టీ నేతల లీలలు వెలుగు చూ స్తున్నాయి. ఆలయ ఈవో, కాంగ్రెస్ నాయకులు కుమ్మక్కై దేవుడికే శఠ గోపం పెడుతున్నారని ఆరోపణలొస్తున్నాయి. కార్యనిర్వహణాధికారి సంతకాన్నే ఆలయ మాజీ చైర్మన్ ఫోర్జరీ చేసి రాములోరి కల్యాణం టికెట్లను విక్రయించడం చర్చనీయాంశమైంది. ఇప్పటి వరకు సుమారు 115 కల్యాణం టికెట్లను కట్ చేసినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. పాలకుర్తి మండలం వల్మిడిలో ఈ నెల 6వ తేదీన సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని, ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో ఆదేశించారు. అయితే ఇందుకు భిన్నంగా స్వామివారి కల్యాణ వేడుకల టికెట్లలో మాత్రం చేతివాటం నడుస్తున్నట్లు సమాచారం. ఏకంగా వల్మిడి దేవస్థానం మాజీ చైర్మన్ మాత్రం గుట్ట కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్‌బాబు సంతకాన్ని ఫోర్జరీ చేస్తూ కార్యనిర్వహణాధికారి పేరుతో భక్తులకు కల్యాణం టికెట్ల రసీదులను ఒక్కొక్కటి రూ.2500 చొప్పున 115 టికెట్లను విక్రయించారు. ఈ విషయాన్ని ఈవో మోహన్‌బాబు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని పలువురు భక్తులు వాపోయారు. కార్యనిర్వహణాధికారి పేరుతో గుడి నుంచి కాకుండా మరో దొంగ రశీద్ బుక్ తయారు చేయడమేమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. దొంగ బుక్ ఉందని తన సంతకాన్ని ఫోర్జరీ చేసి రశీదులు ఇస్తున్నారని ఈవోకు తెలిసినా ఎందుకు పట్టించుకోవడం లేదని భక్తులు మండిపడుతున్నారు. మాజీ చైర్మన్ ఇచ్చిన రశీదు టికెట్లే కరెక్టా లేదా ఎండోమెంట్ అధికారులు ఇచ్చే కల్యాణం టికెట్లు కరెక్టా అని భక్తులు అయోమయానికి గురవుతున్నారు. కార్యనిర్వహణాధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి మండల కేంద్రానికి చెందిన ఓ భక్తుడికి మాజీ చైర్మన్ కల్యాణం టికెట్‌ను గత నెల 26న కట్ చేశాడు. ఈ విషయాన్ని ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఓ భక్తుడు వాపోయాడు. తక్షణమే సంబంధిత ఉన్నతాధికారులు దీనిపై పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోని భక్తులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## పేదల కోసమే సర్కారు సన్నబియ్యం పంపిణీ

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి



చిన్నపెండ్యాలలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కడియం.

స్టేషన్ ఘన్‌పూర్/ చిల్పూరు, ఏప్రిల్ 4 : నిరుపేదల కోసమే సన్నబియ్యం పంపిణీకి సర్కారు శ్రీకారం చుట్టిందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. దీంతో రాష్ట్రంలో మూడు కోట్ల 10 లక్షల మంది లబ్ధిదారులకు ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందుతున్నాయని తెలిపారు. శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లోని పలు గ్రామాల్లో తెల్లరేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో సన్నబియ్యం పంపిణీకి చర్యలు తీసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో నిధుల కొరత ఉన్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నట్లు వివరించారు. వచ్చే మూడు నెలల్లో మల్లన్న గండి లిఫ్ట్-1 పనులను పూర్తి చేసి వర్షాకాలంలోపు చిల్పూరు, వేలేరు మండలాలకు సాగు నీరు అందిస్తానని ఆయన వివరించారు. వచ్చే ఏడాది లోపు దేవాదుల ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేసి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగు నీరు అందిస్తామని కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీకాంత్, మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యాశిరీష్‌రెడ్డి, చింతకుంట్ల నరేందర్ రెడ్డి, అంబటి కిషన్ రాజు, జీడి రమేశ్, చింత ఎల్లయ్య, సింగపురం వెంకటయ్య, సింగపురం రవి, జాకోబు పాల్గొన్నారు. చిల్పూరు మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, మాజీ సర్పంచ్ మామిడాల లింగారెడ్డి, తాళ్లపల్లి సమ్మయ్య, పోలెపల్లి రంజిత్ రెడ్డి, తాళ్లపల్లి సంపత్, గజ్జల దామోదర్, రంగు రమేశ్ పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలలో పారదర్శకంగా నియామకాలు

### కాలేజీ ప్రిన్సిపాల్ గోపాల్‌రావు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 4 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీతో పాటు జనరల్ ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా చేపట్టామని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గోపాల్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 52 ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ సమక్షంలో అభ్యర్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. నిబంధనలకు అనుగుణంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేశారని గోపాల్‌రావు తెలిపారు. పరీక్షలకు హాజరైన అభ్యర్థుల్లో మెరిట్ ఆధారంగా 40 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల్లో అవినీతికి పాల్పడలేదని ఆయన తెలిపారు. తమపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు గోపాల్‌రావు పేర్కొన్నారు.

## నేడు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 4 : భారత మాజీ ఉప ప్రధాని, దళితవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి డాక్టర్ బీ విక్రమ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులంతా కలిసి మహనీయుడు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## బలగం సినిమా దర్శకుడు వేణుకు సత్కారం



దర్శకుడు వేణును సన్మానిస్తున్న గడ్డం సమ్మయ్య

దేవరుప్పుల, ఏప్రిల్ 4 : బలగం సినిమా డైరెక్టర్ వేణును చిందుయక్షగాన కళాకారుడు, పద్మశ్రీ గడ్డం సమ్మయ్య శుక్రవారం ఘనంగా సత్కరించారు. మం డలంలోని అప్పిరెడ్డిపల్లికి వేణు వచ్చిన సందర్భంగా సత్కరించారు. ఈ సందర్భంగా గడ్డం సమ్మయ్య మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే సందేశాత్మకమైన సినిమాను తీసిన వేణు అభినందనీయుడన్నారు. విడిపోయిన ఉమ్మడి కుటుంబాలను ఆలోచింపజేసిన దర్శకుడు వేణు నిర్మించిన బలగం సినిమా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. చిందు యక్షగాన కళా సంపదను జాతీయ స్థాయిలో నిలిపిన గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసిన సందర్భంగా పలువురు సన్మానించారు. గడ్డం సమ్మయ్య మాట్లాడుతూ జానపద కళారూపాలను పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వర చిందు యక్షగాన కళాకారుల సంఘం అధ్యక్షుడు గడ్డం సోమరాజ్, కళాకారులు మురళీకృష్ణ, గడ్డం శ్రీపతి, హిమగిరి, సుధాకర్ ఉన్నారు.

## మూఢ నమ్మకాల నివారణకు కృషి చేయాలి : ఎస్సై



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై పవన్‌కుమార్

పాలకుర్తి, ఏప్రిల్ 4: మూఢ నమ్మకాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని స్థానిక ఎస్సై దూలం పవన్‌కుమార్ అన్నారు. జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదేశాల మేరకు సీఐ గట్ల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి మండలంలోని దర్దేపల్లిలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢ నమ్మకాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మానవుల్లో ఉన్న భయాన్నే క్షుద్ర పూజలు చేసేవారు వినియోగించుకుంటున్నారని తెలిపారు. సైన్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వ్యాధుల నివారణకు డాక్టర్లను సంప్రదించాలన్నారు. ఆధునిక యుగంలో మంత్రాలు, తంత్రాలు లేవన్నారు. ఎవరైనా మూఢ నమ్మకాలపై ప్రచారం చేస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మేకల లింగారెడ్డి, డాక్టర్ కల్నల్ భిక్షపతి, ఎంఈవో పోతుగంటి నర్సయ్య, వీరమల్ల బాబయ్య, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఆకుల శ్రీనివాస రావు, బానోత్ రవీందర్, ఏ ఉమ, మ్యాజిషన్ చంద్రయ్య, మల్లారెడ్డి, కృష్ణ, కనకయ్య పాల్గొన్నారు.

## రాజీవ్ యువవికాసానికి దరఖాస్తు చేయాలి

రఘునాథపల్లి ఏప్రిల్ 4 : రాజీవ్ యువ వికాసం పథకాన్ని యువత సద్వినియోగించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల యువతీయువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుగాను రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. నిరుద్యోగులు స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పి ఆర్థికస్థితిని మెరుగుపర్చుకునేలా ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ పథకానికి ఈ నెల 14వ తేదీ లోగా ధృవీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు.

## నేడు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

కొడకండ్ల, ఏప్రిల్ 4 : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల్లో ఆయా గ్రామాల లబ్ధిదారులకు శనివారం మండల కేంద్రంలో చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ చంద్రమోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలో 42 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కోసం ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. దీనికి ముఖ్యఅతిథిగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. మరోవైపు పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తహసీల్దార్ చంద్రమోహన్ వెల్లడించారు.


## సంక్షేమ పథకాలను లబ్ధిదారులు వినియోగించుకోవాలి



కోమల్లలో రైతులతో మాట్లాడుతున్న ప్రీతం

రఘునాథపల్లి, ఏప్రిల్ 4: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరగారి ప్రీతం అన్నారు. మండలంలోని కోమల్లలో ఎస్సీ కార్పొరేష న్ ద్వారా అందించిన పాడి గేదెలను శుక్రవారం ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళితులు ఆర్థికంగా ఎదిగేందుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. రుణాలను సకాలంలో బ్యాంకుల్లో చెల్లించాలని సూచించారు. నిర్ణీత ప్రకారం చెల్లిస్తే మళ్లీ రుణాలు తీసుకోవచ్చని ప్రీతం వివరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి రాజీవ్ యువ వికాసం హెల్ప్‌లైన్ డెస్క్‌ను పరిశీలించారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకునే సమయంలో మీసేవ, జిరాక్స్ సెంటర్ నిర్వాహకులు ఎక్కువ డబ్బులు తీసుకోకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 4 : కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారితో కలిసి ఆయన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సన్న బియ్యం కిలోకు రూ.40 వెచ్చించి ప్రజలకు ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ దుకాణాలకు సన్న బియ్యం రవాణాపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రజలందరితో కలిసి భోజనం చేయాలని ఆయన సూచించారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ నేపథ్యంలో రేషన్ దుకాణాల వద్ద డిమాండ్ నెలకొన్నందున అవసరమైన మేరకు సన్న బియ్యం అందుబాటులో ఉండేలా చూడాలని కోరా రు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ జిల్లా లో మొత్తం 335 రేషన్ దుకాణాలు ఉన్నాయని తెలిపారు. 1,61,264 ఆహార భద్రత కార్డులు ఉండగా, 4,95,294 మంది లబ్ధిదారులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. వీరందరికీ 3151 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు సూచించారు. సన్న బియ్యం రవాణా, కొత్త ఆహార భద్రత కార్డుల దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేస్తామని వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీసీఎస్‌వో సరస్వతి, డీఎం హాతీరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం గోదాం వద్ద కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## కలెక్టరేట్‌లో ఈవీఎం గోదాము తనిఖీ

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 4 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్స్ (ఈవీఎం) గోదాంను శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తనిఖీ చేశారు. గోదాము వద్ద భద్రత నమోదు రిజిష్టర్ పరిశీలనతో పాటు సీసీ కెమెరాల పనితీరు, ఫైర్ సేఫ్టీ గురించి ఆరా తీశారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్ల నిర్వహణలో పారదర్శకంగా వ్యవహరించాలని కలెక్టర్ అన్నారు. భద్రతా ప్రమాణాలు కట్టుదిట్టంగా అమలు చేయాలని విధుల్లో ఉన్న సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఆర్డీవో గోపీరామ్, కలెక్టరేట్ ఏవో మన్సూరి, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీకాంత్, తహసీల్దార్ హుస్సేన్ పాల్గొన్నారు.

## 7న కలెక్టరేట్ ఎదుట సీపీఎం మహా ధర్నా

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 4 : జనగామ పట్టణంలోని బాణాపురం వద్ద కొత్తగా నిర్మిస్తున్న హైవేపై బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7వ తేదీన కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మహా ధర్నాకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మహా ధర్నా కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు మాట్లాడుతూ 68 రోజులుగా సీపీఎం నాయకులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై ఉద్యమించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, నాయకులు సుంచు విజేందర్, బోడ నరేందర్, లింగం, కల్యాణి, మల్లేశ్, బీరయ్య, వెంకటేశ్, శివ, రజిత, కమల, సంపత్ పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడిగా ప్రసాద్



పాలకుర్తి, ఏప్రిల్ 4: లయన్స్ క్లబ్ ఆఫ్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన చారగొండ్ల ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రసాద్ గతంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పాలకుర్తి ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. లయన్స్ క్లబ్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ప్రసాద్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు బాధ్యులు తెలిపారు. తన నియమాకానికి సహకరించిన సభ్యులకు ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

## కొనుగోలు కేంద్రం ఎత్తివేతను ఉపసంహరించాలి

చిల్పూరు, ఏప్రిల్ 4 : వరి కోతలు ప్రారంభమైన తరుణంలో మండలంలోని కృష్ణాజిగూడెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎత్తివేసేందుకు అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం గ్రామ కార్యదర్శి పోలు సంపత్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాన్ని ఎత్తివేయడంతో దీనిపై ఆధారపడిన సుమారు 50 కుటుంబాలు ఉపాధి కోల్పోతాయని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించాలంటే పల్లగుట్ట లేదా ఫత్తేపూర్ గ్రామాలకు తీసుకెళ్లాల్సి వస్తుందని, దీంతో రైతులకు అదనపు ఖర్చుల భారం పడుతుందన్నారు. కృష్ణాజిగూడెం సెంటర్‌లో 20 మంది హమాలీలతోపాటు, బ్యాగులు నింపడం కోసం 30 మంది మహిళలు పనిచేస్తారని తెలిపారు. అందువల్ల కొనుగోలు కేంద్రాన్ని కొనసాగించాలని కోరుతూ సోమవారం ఆర్డీవో, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాలు ఇచ్చేందుకు రైతులు తరలిరావాలని ఆయన కోరారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకట్రాజయ్య

## విద్యార్థులు చదువులో రాణించాలి

జఫర్‌గడ్, ఏప్రిల్ 4 : విద్యార్థులు క్రమశిక్షణతో పాటు చదువులో రాణించాలని విశ్రాంత ప్రొఫెసర్ టీ వెంకట్రాజయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కూనూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ వెంకట్రాజయ్య మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి చదువొక్కటే ఏకైక మార్గమని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సర్కారు కొలువుల్లో ప్రాధాన్యత కల్పిస్తే పాఠశాలలన్ని కూడా బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పర్వాజ్ పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే పల్లా

నర్మెట, ఏప్రిల్ 4: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు ఖాత పవన్ కల్యాణ్ నిర్మించిన నూతన గృహ ప్రవేశానికి శుక్రవారం ఎమ్మెల్యే పల్లా ముఖ్య అతిథిగా హాజరై ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని కోరారు. ఈ నెల 27న జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గద్దల నర్సింగరావు, ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేశ్, మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, మాజీ మండల అధ్యక్షుడు ఎండీ గౌస్, నీరేటి సుధాకర్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు ఆమెడపు కమలాకర్ రెడ్డి, రామిని శివరాజ్, ఎర్రుల ఏబ్నేజర్, నక్కల రవి, పండుగ మల్లేశం, ఇట్టబోయిన రమేశ్, గడపురం శశిరథ్, గొడుగు రవి, ముక్కెర మహేందర్, రాజు, పొన్నం బాలకృష్ణ, అంజనేయులు పాల్గొన్నారు.



మున్సిపల్ సిబ్బంది జేఏసీ నూతన కార్యవర్గం

## స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ జేఏసీ కార్యవర్గం ఎన్నిక

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 4 : స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, చాగల్లు గ్రామాలతో కలిపి స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీగా ఏర్పడిన నేపథ్యంలో శుక్రవారం పురపాలక సంఘం సిబ్బంది సమావేశం నిర్వహించారు. నూతన జేఏసీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పీ నర్సింహులు, సింగపురం చంద్రమౌళి, అధ్యక్షుడిగా నీల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎడ్ల రాజు, సింగపురం అనిల్, జీ రాజు, ప్రధాన కార్యదర్శిగా గూడూరు.పూర్ణచందర్, సహాయ కార్యదర్శిగా గుర్రం వినయ్, కోశాధికారిగా కొంతం చిరంజీవి, సహాయ కోశాధికారిగా వెలుపుల స్వామి, ప్రచార కార్యదర్శులుగా గుర్రం శ్రీనివాస్, సింగపురం ప్రమోద్, జక్కుల మహేశ్, సభ్యులుగా దామెర రవి, మునిగాల అశోక్, సింగపురం స్వరూప, గుర్రం పెంటమ్మ, ఎల్లమ్మ ఎన్నికయ్యారు.

## తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 4 : మండలంలోని తానేధార్‌పల్లికి చెందిన గీత కార్మికుడు మాచర్ల ఎల్లయ్య (60) తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లయ్య కల్లు గీయడానికి శుక్రవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. గమనించిన తోటి గీత కార్మికులు వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని గౌడ సంఘం నేత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్ ప్రభుత్వాన్ని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PLOT FOR SALE**

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

**WANTED HOSPITAL STAFF**

★LAB-TECHNICIANS (Exp.) OT-TECHNICIANS, MEDICAL SHOP BOYS (Exp.) & Aayammas. Cont: Guardian Hospital, Mulugu 'x' Road, Warangal. 12 to 2 pm.
NTW-496

**మహిళలకు శుభవార్త**

★శ్రీ శైలి బ్యూటీ పార్లర్‌లో ఫ్రీ బ్యూటీషియన్ కోర్సు గవర్నమెంట్ సర్టిఫికెట్‌తో నేర్పించబడును. టైలరింగ్, మగ్గం వర్క్, మెహిందీ 5 వేలకే With సర్టిఫికెట్‌తో నేర్పబడును. సెల్: 9989060668
NTW-336920

**LOST OF DOCUMENTS**

★I, RAPOLU SRILATHA, W/o. SURENDER, R/o. 7-21, Dwarakapet, Sarwapur, Narsampet Mandal, Warangal District, Telangana State, have lost the original Sale Deed Document No. 1337/2023, Dt. 12-12-2023, and the Gift Deed Original Link Document No. 1314/2022, Dt. 05-09-2022. If anyone is found contact no. 9618766650.
NTW-17553

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565